మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



## దుందుభిని తోడేస్తున్న తోడేళ్లు

**భారీ సంఖ్యలో అక్రమ ఇసుక రవాణా**



పెద్దాపుర్ సమీపంలో ఉన్న దుందుభి వాగులో తోడేస్తున్న ఇసుక

**ఉప్పునుంతల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దాపుర్ గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న దుందుభి వాగు నుంచి వ్యవసాయ పొలాలకు అనుసరించి ఉన్న దుందుభి నుంచి భారీ సంఖ్యలో ఇసుకను తోడేస్తున్నట్లు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు ఆరోపించారు. తమ వ్యవసాయ పొలాలకు అనుసరించి ఉన్న దుందుభి నుంచి యంత్రాల ద్వారా పగటి వేళలో తోడేసి నిల్వులు పెట్టుకొని రాత్రి వేళల్లో భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా కొనసాగుతుందని ఆయన ఆరోపించారు. అన్ని అనుమతులు ఉంటే పగటిపూట నడపకుండా రాత్రి వేళల్లో ఎందుకు నడపవలసి వస్తుందని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. రాత్రి వేళల్లో భారీ సంఖ్యలో అక్రమ రవాణా కొనసాగుతున్న నివారించే అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. నియంత్రించే అధికారుల రహస్య ఒప్పందం ద్వారా కొనసాగిస్తున్నట్లు బహాటంగా తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణా పై తరుచుగా ఫిర్యాదు చేసేవారు ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఒప్పందాలు కుదుర్చుకున్న ట్రాక్టర్ యజమానులు మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఓ వ్యాపారి గుండా లావాదేవీలు జరుపుతున్నట్లు అరోపించారు. గతంలో డ్రోన్ కెమెరా ద్వారా, లోకాయుక్తకు వెళ్లిన వ్యక్తులు ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి న్యాయం చేయాలని మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు కోరారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన సమగ్ర శిక్షణ అధికారి

**- కేజీబీవిల పర్యవేక్షణ అధికారిణి శోభారాణి**



రికార్డులను తనిఖీ చేస్తున్న కేజీబీవిల పర్యవేక్షణ అధికారిణి శోభారాణి

**కల్వకుర్తి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం కేంద్రంలోని కల్వకుర్తి, రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊరుకొండ మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాలను సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి తో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా బాలిక విద్యాభివృద్ధి అధికారి, కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యాలయాల్లో వంటగది, నిలువ ఉన్న సరుకులను, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, గణిత పాఠాలు బోధించారు. విద్యాబోధన అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో మెలకువలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఏజెన్సీల నుంచి కుళ్లిపోయిన కూరగాయలను తీసుకోవద్దన్నారు. నాణ్యత లేని తినుబండారాలతో వంటలు చేసి విద్యార్థులకు పెట్టకూడదని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అదే విధంగా వ్యాధులకు గురైన విద్యార్థుల వివరాలను రికార్డులో నమోదు చేయాలని సూచించారు.

## దీక్షలో బోనాలెత్తిన సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులు



సమగ్ర శిక్ష దీక్షలో బోనమెత్తిన మహిళలు

**గద్వాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెలో భాగంగా శుక్రవారం వినూత్న రితిలో మహిళా ఉద్యోగులు బోనాలెత్తారు. దీక్షా కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు బోనాలెత్తి స్మృతి వనం నుండి సుంకులమ్మ గుడివరకు వెళ్లారు. మా యొక్క డిమాండ్స్ నెరవేరాలని బోనం ఎత్తినట్లు మహిళా ఉపాధ్యాయిని జమున తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు, మా సమ్మెకు మద్దతు తెలపడం జరిగిందిన్నారు. అదేవిధంగా అన్ని కేజీబీవీ ల నుండి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, యూఆర్, స్పెషల్ ఆఫీసర్ శేషన్న ,సి.ఆర్.టి.లు. పీజీసీఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఈ సమ్మెలో పాల్గొనడం జరిగింది. డీపీఓ వింగ్ అధ్యక్షుడు డిఎల్ఎంటి అధ్యక్షులు బి రామాంజనేయులు, మిస్ వింగ్ అధ్యక్షుడు శ్రీధర్, సీసీఓ వింగు అధ్యక్షుడు ఆల్తాఫ్, సీఆర్పీ వింగ్ అధ్యక్షుడు ఎంఏ సమీ, ఐఈఆర్పి వింగ్ అధ్యక్షుడు మురళి, పిటిఐ వింగ్ అధ్యక్షుడు రాజేందర్ రోజువారిగ వీరు పాల్గొంటున్నారు. అదేవిధంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు హుషనప్ప ,జేఏసీ ప్రధాన కార్యదర్శి గోపాల్ ,కేజీబీవీ మహిళా అధ్యక్షురాలు ఎస్పి ప్రణిత, సమగ్ర శిక్ష లోని అన్ని వింగుల అధ్యక్షులు పాల్గొని గురువారం నిరవధిక సమ్మెను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొనడం జరిగింది. ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి గా హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయ్యాలి. అప్పటి వరకు పే స్కేల్ అమలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణిత, శ్రీదేవి, స్రవంతి, గోపాల్, రామంజనేయులు, బహద్దూర్, అల్తాఫ్, సమీ, షేసన్న,అధ్యక్షులు హుసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ అమ్మ వారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి



జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు జడ్జి

గద్వాల, డిసెంబరు 27 ప్రభాతవార్త : అలంపూర్ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామిని సుప్రీం కోర్టు జడ్జి ఎస్వీఎన్ బట్టి, జోగులాంబ గద్వాల జిల్లా జడ్జి కుష లు శుక్రవారం దర్శించుకున్నారు. వారితో పాటు గద్వాల్ డిఎస్పి సత్యనారాయణ అలంపూర్ సీఐ రవిబాబు ఎస్ఐలు ఉన్నారు.

# విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**సాంఘిక సంక్షేమ హాస్టల్ ఆకస్మిక తనిఖీ**

**మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తాం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 27 ప్రభాతవార్త: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణం, మోనప్ప గుట్ట, కలెక్టర్ బంగ్లా వద్దనున్న సాంఘిక సంక్షేమ బాలికల (ఎ) హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వార్డెన్ మాధవిని అడిగి హాస్టల్ లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల అండగా ఉంటుందని, ఏ సమస్యలు ఉన్న మా దృష్టికి తీసుకురావాలని మంచిగా చదువుకొని, జీవితంలో స్థిరపడాలని ఆయన సూచించారు. మన మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ విద్యాలయాలలో, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లను, గురుకుల పాఠశాలలను అన్ని రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం అందించేందుకు కృతనిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. హాస్టల్లో చదివే విద్యార్థులు తప్పకుండా వార్తాపత్రికలు చదివే అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. జనరల్ నాలెడ్జ్ ఉంటేనే పోటీ పరీక్షలలో విజయం తథ్యమని, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కోసం అందరూ తయారు కావాలని, పోటీ పరీక్షలకు తయారయ్యే వారికోసం పుస్తకాలు, డిజిటల్ బోర్డు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం బిసి బాలికల హాస్టల్ ను సందర్శించి విద్యార్థులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మంచిగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మీకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కౌన్సిలర్ ఖాజా పాషా, మండల ఓబిసి చైర్మన్ రాజుగౌడ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, హాస్టల్ వార్డెన్ మాధవి, బిసి హాస్టల్ వార్డెన్ బందెమ్మ తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ఏకాగ్రతతో చదువుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి**

ఏకాగ్రతతో చదువుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ (బి) ను ఈరోజు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ సమస్యలను వీలైనంత త్వరగా తీరుస్తామని, మీరంతా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ప్రిపరేషన్ కావాలని, మీకు అండగా ఉంటూ కావాల్సిన మెటీరియల్స్ ను అందుకు సంబంధించిన పుస్తకాలు, లైబ్రరీకి కావలసిన అన్ని పుస్తకాలు ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజులలో ఏకాగ్రతతో చదివి మంచి స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఉచిత బస్సు ప్రయాణం ఆడ కూతురుకు కల్పించడం వల్ల ఆత్మ స్థైర్యం పెరుగుతుందని, ఇది తెలియక చాలామంది సన్నాసులు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. మీకు వంట చేసే ఆయమ్మలను గౌరవించాలని, ప్రేమగా మాట్లాడాలని సూచించారు. మీరు ఉన్నత స్థితికి చేరుకొని మీరు కూడా మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, వార్డెన్ మధులత, కాలనీ ప్రముఖులు బాలయ్య, చంద్రశేఖర్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్యే

## కొత్త సంవత్సరం రోజున డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

**నిబంధనల మేరకు చర్యలు**

**అతిచేస్తే ఎవరినీ వదలొద్దు**

**రాత్రి 12 గంటల వరకే రోడ్లపై అనుమతించండి**

**పోలీసులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాలు**

**జడ్చర్ల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** 31 వ తేదీ రాత్రి కొత్త సంవత్సరం రోజున జడ్చర్ల నియోజకవర్గం అంతటా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నిందితులు ఎవరైనా వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జడ్చర్ల పట్టణ, గ్రామీణ పోలీసు అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరం రోజున ఆనందంగా ఉండాలని, సంతోషంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని అనుకోవడంలో తప్పు లేదని అన్నారు. కొత్త సంవత్సరం రాక సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకోవడం, దైవ ప్రార్థనలు చేసుకోవడం, కుటుంబాలతో ఆనందంగా గడపడం చేయాలని సూచించారు. అయితే కొత్త సంవత్సరం పేరు చెప్పి మితిమీరి మద్యం తాగి రోడ్ల మీదకు రావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు జరిగి అనేక మంది జీవితాలు నాశనం అయ్యాయని పేర్కొన్నారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో దేశ వ్యాప్తంగా 1.78 లక్షల మంది మరణించారని, మరణించిన వారిలో ఎక్కువ మంది యువతేనని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మితిమీరి మద్యం తాగి రోడ్ల మీద తిరిగే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. 31 వ తేదీ రాత్రి డీజేలు పెట్టి, అల్లరి చేస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి సూచించారు. రాత్రి 12 గంటల వరకు మాత్రమే రోడ్లపై తిరిగే అవకాశం ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులు, ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జడ్చర్ల టౌన్ సిఐ ఆదిరెడ్డి, రూరల్ సిఐ నాగార్జున, ఎస్ఐలు చంద్ర మోహన్, శివనాథ్‌గౌడ్, రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్ ఎస్సైలు రవి, తిరుపతి, శివ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి ఘన స్వాగతం

**బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి డికె స్నిగ్దా రెడ్డి**

**గద్వాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా అధికారిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి డీకే బంగ్లా లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధా రెడ్డి తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణించడంతో అధికారిక కార్యక్రమాలు రద్దు అవడంతో డీకే బంగ్లా లో బిజెపి నాయకులతో సమావేశమైనారు. నాయకులు కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగ్లాకు వచ్చిన బండి సంజయ్ కి జిల్లా కోర్టు నిర్మాణం గద్వాల పట్టణంలోనే ఉండాలని, పిజెపి క్యాంపులో గాని గద్వాల పట్టణ సమీపంలో ఉండాలని న్యాయవాదులు వినతిపత్రం ఇచ్చారు. అలాగే తపస్ జిల్లా నాయకులు రాష్ట్రంలోని జాతీయ విద్యా విధానం అమలు చేయాలని ఇన్కమ్ టాక్స్ 5 లక్షలకు పరిమితి పెంచాలని వినతి పత్రం ఇచ్చారు. అలాగే కేజీబీవీ లో పనిచేస్తున్న సర్వ శిక్షణ అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 25 లక్షలు ఇవ్వాలని ఆరోగ్య భద్రత కల్పించాలని వినతి పత్రం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్ వైద్య ఆఫీసర్లు 2023 నోటిఫికేషన్ భర్తీ చేయాలని ఎన్ హెచ్ ఎం స్కీం కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఐదు సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్ర కల్పించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.



బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న డీకే స్నిగ్ద రెడ్డి, మాజీ చైర్మన్‌లు కృష్ణ వేణి, పద్మావతి, జయశ్రీ, అక్కల రామాదేవి

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహులు ,అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివారెడ్డి ,అసెంబ్లీ మాజీ కన్వీనర్ రామాంజనేయులు ,పట్టణ అధ్యక్షుడు బండల వెంకటరాములు, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జ పురం వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి కౌన్సిలర్లు త్యాగరాజ్ ,కుమ్మరి శీను, బండల పాండు, రజక జయ శ్రీ జిల్లా నాయకులు,మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్‌ది ప్రత్యేక పాత్ర

**భారతదేశ ఆర్థిక అసమాన్యుడు అస్తమించడం దేశానికి తీరని లోటు ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర బిల్లును ఆమోదింపజేసిన ఆర్థిక అసమాన్యుడు మన్మోహన్ సింగ్ అని వనపర్తి ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని మాదాపూర్ లో గల తన కార్యాలయంలో ఎమ్మెల్యే దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు భారతదేశ ప్రధానిగా, 33 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందినట్లు వచ్చిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టి భారతదేశ అభ్యున్నతికి, దేశ ఆర్థిక పురోగతికి నిబద్ధతగా పాటుబడిన గొప్ప నాయకుడని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

## దేశాన్ని గాడిన పెట్టిన ఘనత మన్మోహన్‌సింగ్‌దే

**మక్తల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** మూడు దశాబ్దాల క్రితం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న భారతదేశాన్ని ఆర్థిక శాఖ మంత్రి హోదాలో సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని గాడిన పెట్టిన ఘనత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దే అని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు రవికుమార్, నాయకులు కోళ్ల వెంకటేష్, కట్ట సురేష్, కావలి తాయప్ప, వల్లంపల్లి లక్ష్మణ్, గొల్లపల్లి నారాయణ, వాకిటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

## చిన్నమారు లిఫ్ట్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**చిన్నంబావి, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నమారూరు లిఫ్ట్ ఇరిగేషన్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామ చంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్‌లు లిఫ్టును పరిశీలించారు. జూరాల ఎడమ కాలువ డి 36 కాలువకు సరిగా నీళ్ళు రాని కారణంగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులతో కలిసి చిన్నమారు లిఫ్టు దగ్గర పైపులు పాడై నీళ్ళు సరిగా రాక పోవడాన్ని గుర్తించిన కాంగ్రెస్ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పాడైన పైపులకు మరమ్మతులు చేయించి రైతుల పంట పొలాలకు నీళ్ల ఇబ్బంది జరగకుండా చివరి ఆయకట్టు వరకు నీళ్లు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెబ్బేటి రామచంద్రారెడ్డి, ఇటిక్యాల కృష్ణప్రసాద్ యాదవ్, జంగ బిచుపల్లి యాదవ్, పెబ్బేటి తేజారెడ్డి అధికారులు తిని జ్యాషువ, జగదీశ్వర్ రెడ్డి నీళ్ళువదిలే లస్కర్లు తదితరులు ఉన్నారు.



లిఫ్టును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ


లక్ష్మమ్మకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం వివిద గ్రామాలలో మృతి చెందిన మృ తుల కుటుంబాలకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.దేవరకద్రలో మాజీ మార్కెట్ చైర్మెన్ దొబ్బలి అంజనేయులు తల్లి లక్ష్మమ్మ మృతి చెందారు.దీంతో విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవరకద్రకు వచ్చి దొబ్బలి అంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.లక్ష్మ మ్మ పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు.అలాగే లక్ష్మీపల్లిలో మృతి చెందిన మాడెమోని ఈరమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు.అలాగే మృతి చెందిన కూచురు కాంతమ్మ కుటుంబసభ్యులను కూడ పరిమర్శించారు.మాడెమోని చెన్నమ్మ కుటుంబసభ్యులను కూడ మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరిసింహ్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్,పిఏసిఎస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి,మాజీ యంపీటీసీ వెంకట్రాములు,నాయకులు కుర్వ శ్రీను,హన్మంతు,మన్యంకొండ,బాలసాయి, కృష్ణారెడ్డి,నాగరాజు,జగన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధి హామీ ప్రజా వేదిక

**చిన్న చింతకుంట, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ ఉపాధి హామీ గ్రామీణ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ అనంతరం ఏర్పాటు చేసే ప్రజావేదిక సమావేశాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ మండల ప్రోగ్రాం అధికారి నవీన్ కుమార్ తెలిపారు.ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు గాను ఈనెల 19 నుంచి 27 వరకు ఆయా గ్రామాలలో ప్రత్యేక బృందాలతో సామాజిక తనిఖీ నిర్వహించారు.ఈ సామాజిక తనిఖీలో వచ్చిన నివేదికల ఆధారంగా 14వ ప్రజావేదిక ద్వారా ప్రజలకు వివరించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ ప్రజా వేదిక సమావేశానికి అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ కూలీలు హాజరు కావాలని ఆయన కోరారు.

## విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలి


రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న విద్యార్థులు

**మక్తల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం తుక్కుగూడలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలలో నారాయణపేట జిల్లా నుంచి 12 మంది బాలికలు, 12 మంది బాలురు పాల్గొంటున్నారని, వారంతా రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విశేషంగా రాణించాలని డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, విశ్రాంత పిఈటి బి.గోపాలం ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్ నుండి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు దుస్తులను, కిట్లను అందజేశారు. రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన బాలికలు శ్రావణి, మాధురి, నిహారిక, జెస్సికా, చందన, మల్లీశ్వరి, లాస్య, గాయత్రి, మేఘన, దీప్తి, సాక్షిత, నందిని, బాలురు వినయ్ కుమార్, పరశురాములు, హరికృష్ణ, భరత్ కుమార్, దర్శన్, రోహిత్, అరవింద్, మహమ్మద్ ఫరహాన్, వెంకటేష్, అనిల్, రమేష్, వినయ్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీడీలు విష్ణువర్ధన్, ఈశ్వర్, నరేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## చౌదర్‌పల్లి దర్గా మతసామరస్యానికి ప్రతీక

**నేటి నుండి హజ్రత్ మదారుషా అసహాది ఉర్సు ఉత్సవాలు**


అలంకరణలో హజ్రత్ మదారుషా అసహాది దర్గా

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో కొలువుదీరిన హజ్రత్ మదారుషా అసహాది దర్గా ఉర్సు వేడుకలు శనివారం నుండి ప్రారంభం కానున్నాయి.చౌదర్‌పల్లిలోని ఈ దర్గా నుమతసామరస్యానికి ప్రతీక నిలిచింది. ప్రతి ఏడాది గ్రామ సమీపంలోని హజ్రత్‌మదారుషా అసహాది దర్గా ఉర్సు వేడుకలను గ్రామస్థులు కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఉర్సు వేడుకలను గ్రామస్థులు,నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.ధూలేశ్వర భక్తబృందం,గ్రామస్థులు,భక్తుల అధ్వర్యంలో ఈ ఉర్సు వేడుకలను నిర వ్వహిస్తున్నారు. ఉర్సు ఉత్సవాలలో మొదటి రోజు గంధోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గలీఫా,పూల ఛాదర్‌లచే దర్గాపై కప్పి ప్రత్యేక ఫాతెహాలను నిర్వహిస్తారు.అలాగే ఖవ్వాలి కార్యక్రమాన్ని కూడ నిర్వహిస్తారు.దర్గాలో ఖతం ఫాతెహా,ఖరాన్ సలాం,శ్రీవారి మహాప్రసాదం,భోజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.చౌదర్‌పల్లి,హాజిలాపూర్ గ్రామాల భక్తులచేత ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

## మాజీ ఎంపీని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ పార్లమెంటు మాజీ ఎంపీ మంద జగన్నాథం అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ హాస్పటల్ లో చికిత్స పొందుతుండగా శుక్రవా రం కొండేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి, షేకుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి తదితరులు మాజీ ఎంపీ మంద జగన్నాథం ను పరామర్శించారు. ఆయన తనయుడు మంద శ్రీనాథ్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు..

## మన్యంకొండలో కొనసాగుతున్న ధనుర్మాసపూజలు

**ప్రతిరోజు బ్రహ్మముహూర్తంలో ద్రావిడ భాషలో పురోహితుల పాశురపఠనం**


పాశురాలను పఠిస్తున్న పురోహితులు

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్రమాసం ధనుర్మాసపూజలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది దేవస్థానంలో ధనుర్మాసంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ సాంప్రదాయరీతిలో దేవస్థానంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండుగ వరకు గోదాదేవి కళ్యాణంతో ఈ పూజలు దేవస్థానంలో కొనసాగుతాయి. ధనుర్మాసం సందర్భంగా దేవస్థానంలో ప్రతి రోజు తెల్లవారుజామున పురోహితులు గోదాదేవి ఆలపించిన పాశురాలను(తిరుప్పావై శ్లోకాలను) పఠిస్తున్నారు. ఈ విధంగా నెల రోజుల పాటు ప్రతి రోజు ఒక పాశురం చొప్పున స్వామి వారి గర్భగుడిలో బ్రహ్మముహూర్తంలో పురోహితులు పఠిస్తున్నారు. ద్రావిడ భాషలో ఈ పాశురాలను పఠిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు,ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్‌గౌడ్,నారాయణరెడ్డిలతో పాటు పురోహితులు తదితరులు పాల్గొంటున్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

**కొత్తకోట డిసెంబరు 27 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన పల్లెపాగు సులోచనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి మృతురాలికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిదంగా దశదినకర్మకు 5000/- రూపాయలు గ్రామ బిఆర్ఎస్ నాయకుల ద్వారా ఆర్థిక సాయన్ని పంపించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సాయిలు, కుర్మయ్య, ధనుష్, నాయకులు ప్రభుదాస్, గోకరయ్య, ఇశ్రాయిల్, బాబు, డీకే లక్ష్మణ్, మేస్త్రి నాగన్న, సవరయ్య, చిన్న కుర్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణల్లో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర


బిజినేపల్లిలో మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పిస్తున్న నాయకులు


ఆత్మకూరులో ..

**బిజినపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మన్మోహన్ సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణల్లో భారత్ మంచి విజయాలు సాధించింది అని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. బిజినేపల్లి అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పాలించిన ప్రధానుల్లో మన్మోహన్ సింగ్ ఒకరిగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిద్దె రాములు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకట స్వామి, మాజీ ఎంపీపీ ఎద్దుల రాములు, మాజీ సర్పంచ్‌లు గంగనమోని తిరుపతయ్య, అమృత రెడ్డి, బాలరాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మిద్దె మల్లేష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముక్తార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎద్దుల శ్రీకాంత్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కత్తే ఈశ్వర్, కుమ్మరి బాబు, పండ్ల పాష, వెంకటేష్ గౌడ్, కారుకొండ శ్రీనివాస్ గౌడ్, లేట్ల బాలస్వామి, వలియోద్దీన్ అంజాద్ తౌఫిక్, అన్ను భూపాల్, బుచ్చన్న, లవకుశ, నారాయణగౌడ్, సైదుల్, ఆనంద్, మిద్దె కురుమయ్య, మిద్దె పర్వతాలు, మిద్దెసూరి, కిజర్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి**

**ఆత్మకూరు డిసెంబరు 27 ప్రభాతవార్త :** భారత దేశ మాజీ ప్రధాని ఆర్థికవేత్త దివంగత నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శుక్రవారం రోజు ఆత్మకూరులోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ,ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ,మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా, తదితరులు మాట్లాడుతూ దేశం కృష్ణ పరిస్థితిలో ఉన్న సమయంలో ఆర్థికవేత్తగా మన్మోహన్‌సింగ్ ముందుచూపుతో దేశాన్ని అభివృద్ధి పథంలో కొనసాగించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశారని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం అవలంబిస్తున్న ఆర్థిక విధానాలు గతంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఏర్పాటు చేసినవే కాబట్టి ప్రస్తుత పాలకులు మన్మోహన్ సింగ్ ఆశయాలను కొనసాగించేందుకు రాజకీయాలకతీతంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని వారి విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటుగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్లగొండ శ్రీనివాసులు ,అంజాద్ ఖాన్ ,వెంకటేష్ ,వెంకటన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాజీ ప్రధానమంత్రి డాక్టర్**
**మన్మోహన్ సింగ్ మరణం దేశానికే తీరని లోటు**

**అమరచింత డిసెంబరు 27 ప్రభాతవార్త :** మాజీ ప్రధానమంత్రి ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం భారతదేశానికే తీరని లోటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్ఎం అరుణ్ కుమార్ అన్నారు. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపకంగా శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ కూలి పథకాన్ని అమలు చేసి గొప్ప మహోన్నత వ్యక్తి అని వారు అన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి విద్య హక్కు దక్కాలని లక్ష్యంతో విద్య హక్కు చట్టంతో పాటు ప్రజలకు సమాచార హక్కు పొందే హక్కు చట్టాన్ని అమలు చేసిన గొప్ప మహా మేధావి అని వారు అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశం ఎస్టీసెల్ మండల అధ్యక్షులు హనుమంతు నాయక్ ఎన్ఎస్ యు ఐ మండల అధ్యక్షులు హరీష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తౌఫిక్ మాజీ ఎంపిటిసి తిరుమలేష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మికాంతరెడ్డి ,9 వ వార్డు కౌన్సిలర్ రాజశేఖరరెడ్డి ,బాలరాజు, మహేందర్ ,ఆంజనేయులు ,అక్బర్ ,రాకేష్ గౌడ్ ,శివ దిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు**
**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

**దేవరకద్ర, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డా. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని దేవరకద్ర ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆయన మరణం అత్యంత బాధాకరమన్నారు. రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా అంతకుముందు కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా మన దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలు అమూల్యమన్నారు. మన్మోహన్ సింగ్ సారథ్యంలో మన దేశం అత్యధిక వృత్తి రేటు సాధించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు కీలకమన్నారు. ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్చిక మాంధ్య ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడకుండా గాడిలో పెట్టిన ఘనత మన్మోహన్ సింగ్ కు దక్కిందన్నారు. మన్మోహన్ సింగ్ హక్కుల ఆధారిత విప్లవం భారత రాజకీయాల్లో సరికొత్త శకాన్ని సృష్టించిందన్నారు. సమాచార హక్కు చట్టం మన దేశ పౌరుల హక్కులను కాపాడితే, ఉపాధి హామీ పథకం నిరుపేదల జీవితాలను మార్గదర్శి అయిందన్నారు. ఆ మహనీయుడి సంస్కరణలు, సాధించిన విజయాలు మన దేశం ప్రతి పౌరుడుకి ఆదర్శమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు.

**మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి**
**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్**

**గద్వాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మాజీ ప్రధాని, ఆర్థికవేత్త, మేధావి మన్మోహన్ సింగ్ సేవలను దేశం ఎల్లప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టు ఎక్కించిన ఆర్థిక ఘనుడు అని పేర్కొన్నారు. నిజాయితీ, మంచితనం, సమర్థవంతంగా పనిచేయడం అంశాలను మన్మోహన్ సింగ్ చూసి నేర్చుకోవాలని అన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రపంచం లోనే ప్రబల శక్తిగా నిలబెట్టిన గొప్ప మేధావి అని, ఆయన మరణం పూరించలేని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

**భారతదేశ ఆర్థిక వ్యవస్థ రూపశిల్పి,**
**మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి తీవ్ర సంతాపం**
**అరుదైన మహనీయుని కోల్పోయిన దేశం**

**పెబ్బేరు డిసెంబరు 27 ప్రభాతవార్త :** ప్రపంచ ఆర్థికవేత ఎకనామికల్ ప్రొఫెసర్‌గా, రాజకీయవేత్తగా పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధానిగా అజాతశత్రువుగా తనదైన శైలిలో దేశానికి ఆర్థిక రూపశిల్పిగా మార్చి పేదల బలహీన వర్గాల కు ఉపాధి హామీ ద్వారా పని కల్పించి సమాచార హక్కు చట్టం ద్వారా అందరికీ సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి బాలలకు విద్యను తప్పనిసరిగా చేసి ఎన్నెన్నో తన మోన ప్రపంచంతో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపిన మహనీయులు డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ దేశానికే కాకుండా ప్రపంచానికి ఆర్థిక వ్యవస్థకు పెద్దదిక్కుగా ఉన్న మహనీయులు డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర మానసిక దిగ్భాంతుకి గురి చేసిందని తెలియజేస్తూ మహనీయులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కార్పాకుల వెంకట రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు సురేందర్ గౌడ్, పురురమణ, రవీందర్ నాయుడు, దయాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రాంపురం సహదేవుడు, కృపాకర్ రెడ్డి, బోయ సత్తి ,శివసాయి, యుగంధర్ రెడ్డి, రాములు, రాధాకృష్ణ, వెంకటయ్య గౌడ్ పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఇస్రంపల్లిలో మాజీ ప్రధానికి ఘన నివాళి**

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ఇస్రంపల్లిలో శుక్రవారం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.మండల పార్టీ అధ్యక్షుడు మాదిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకొంటూ నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్ల కృష్ణయ్య, సలాం,రాజ్‌మొహ్మద్,రసూల్,తిరుపతయ్య,వాకిటి కృష్ణయ్య,కుర్వ మన్యం, నన్నేమియా,మైమూద్,వాకిటి రాఘవేందర్,నాగరాజు, శివలతో పాటు గ్రామస్థులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.దేవరకద్రలో కూడ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


అమరచింతలో..


మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


అమరచింతలో..

## ఆత్మకూరును అన్ని విధాల ఆదుకోవాలి ఎమ్మెల్యేకు వినతి


ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఆత్మకూరు డిసెంబరు 27 ప్రభాతవార్త :** తాలూకా కేంద్రమైన ఆత్మకూరు పట్టణం పూర్వవైభవం కోల్పోయి అన్ని విధాలుగా నష్టపోయిందని తద్వారా ప్రస్తుతం ఆత్మకూరును రెవిన్యూ డివిజన్ గా ఏర్పాటుచేసి అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు శుక్రవారం రోజు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు వివరిస్తూ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆత్మకూరు మండలాన్ని మూడు ముక్కలుగా చేసి తీరని అన్యాయం చేశారని తద్వారా ఆత్మకూర్ ప్రభావం కోల్పోయి తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. సంస్థానా దిశల కాలం నుండి ప్రభావం కలిగిన ఆత్మకూర్ పట్టణాన్ని మూడు ముక్కలుగా చేసి గత పాలకులు తీరని అన్యాయం చేశారని ప్రస్తుతం ఆత్మకూరును రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయడమే ఏకైక మార్గమని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆత్మకూరును రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటుచేసి తమకు న్యాయం చేయాలని పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మకూరును అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రత్యేకమైన హామీ ఇచ్చారు కాబట్టి ఆ హామీని నిలబెట్టుకునే కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటుచేసి ఆత్మకూరును ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు రవికుమార్ ,బంగారు భాస్కర్ ,యాదగిరి శెట్టి ,దామోదర్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు ఉన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** నియోజకవర్గ అభివృద్ధికై పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి శుక్రవారం రాయచూరు లో అందజేశారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ నందు కేంద్ర హోం శాఖ సయమంత్రి బండి సంజయ్ ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి స్వామి వివేకానంద చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రిని ఎమ్మెల్యే కోరారు. నవోదయ స్కూల్, సైనిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం తో పాటు గట్టులో ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయాలని కోరారు. అలాగే గద్వాల రాయచూర్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించాలని, ప్రజల రాకపోకలతో పాటు రవాణా సౌలభ్యం పెరుగుతుందని రాయచూర్ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ తో కలిసి ఎమ్మెల్యే కోరారు. కేంద్ర మంత్రి సానుకులంగా స్పందించారు. త్వరలో నే గద్వాల సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు పరిష్కరిస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, కౌన్సిలర్ దౌలు, రాయచూర్ కౌన్సిలర్ తిమ్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు నాయకులు ఉరుకుంద, గోవిందు, కురుమన్న, ధర్మ నాయుడు, యుగంధర్ గౌడ్ ,కొత్త గణేష్, రాజు నాగార్జున, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధానికి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులు

**ఉప్పునుంతల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు క్యామ మల్లయ్య, జిల్లా నాయకులు వెల్టూరి రేణయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మెడమోని భాస్కర్, రాష్ట్ర బిసి సంఘం నాయకులు కాశన్న యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, ఐఎన్‌టియుసి మండల అధ్యక్షుడు మేకల రామచంద్రయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింతగాళ్ళ శ్రీనివాసులు, వెంకటేష్, మహేష్ యాదవ్, అశోక్, రేణయ్య, కొట్టం శేఖర్,తేజ, బాలయ్య, వెంకటయ్య, ఖలీల్, శివ లు, ఖాదర్, భాస్కర్, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## నేడు శని త్రయోదశి ప్రత్యేక పూజలు

**బిజినేపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త :** నంది వడ్డేమాన్ గ్రామంలో శ్రీ సార్థ సప్త జేష్ట మాత సమేత శనేశ్వర స్వామికి శనివారం శని త్రయోదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు గవ్వమటం విశ్వనాథ శాస్త్రి తెలిపారు. వేద బ్రాహ్మణులచే మంత్రోచ్ఛరణాల మధ్య శాస్త్రోక్తంగా శనేశ్వర స్వామికి తిల తైలాభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మసూత్రం గల పరమశివునికి విశేషంగా రుద్రాభిషేకం, అభిషేకం,అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.భక్తులు జన్మరిత్యా, గోచార రీత్యా మీనరాశి నుండి మేషరాశి వరకు స్వామి వారి కృప కటాక్షము పొందుటకు, శనిగ్రహ శాంతి కొరకు శనైశ్చరస్వామి కి ప్రత్యేక తిల తైలా అభిషేక పూజలు చేయాలని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుండి భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయనట్లు ఆలయ కమిటీ తెలిపింది.

## కౌకుంట్లలో ఇందిరమ్మ ఇళ్ళ సర్వే


కౌకుంట్లలో ఇందిరమ్మ ఇళ్ళ సర్వే

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** కౌకుంట్లలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ళ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు.కాంగ్రేస్ పార్టీ జిల్లా నాయకులు కిషన్‌రావు అధ్వర్యంలో ఈ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు.కౌకుంట్ల మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా ఈ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## అయ్యప్ప స్వామి ప్రసాద పంపిణీ

**దేవరకద్ర, డిసెంబరు 27 ప్రభాతవార్త :** లాల్ కోట అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరి యాత్రను పూర్తి చేసుకొని వచ్చిన సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వడ్ల గోవర్ధనచారితో పాటు ఆయన ప్రియ శిష్యుడు లాల్ కోట కెంగూరి అంజన్న యాదవ్ గురుస్వామి, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, శివ స్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం











**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర బిల్లును ఆమోదింపజేసిన ఆర్థిక అసామాన్యుడు మన్మోహన్‌సింగ్ అని వనపర్తి ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని మాదాపూర్‌లో గల తన కార్యాలయంలో ఎమ్మెల్యే దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు భారతదేశ ప్రధానిగా, 33 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందినట్లు వచ్చిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టి భారతదేశ అభ్యున్నతికి, దేశ ఆర్థిక పురోగతికి నిబద్ధతగా పాటుబడిన గొప్ప నాయకుడని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

**కల్వకుర్తి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం భారత దేశం మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మరణం దేశ ప్రజలకు తీరని లోటని, ఒక గొప్ప మహా నాయకుడిని దేశం కోల్పోయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అదే విధంగా కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కాన్సిలర్లు శానవాజ్ ఖాన్,ఏజాస్, గోరటి శ్రీనివాసులు, రవి,బాలునాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, పుస్తకాల రాహుల్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కల్వకుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో:** కల్వకుర్తి పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మెన్ తలసాని జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి 5నిమిషాల పాటు మౌనం పాటించారు.కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ శ్యామ్, డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, కార్యాలయం సిబ్బంది నాగమణి, రమాదేవి, జంగయ్య, సాయ, తిరుపతయ్య, రాజు నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**వెల్దండ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ని కోల్పోవడం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో శ్రీశైలం –హైదరాబాద్ జాతీయ రహదారిపై శుక్రవారం దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్.బి.ఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాయకులు పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, సంజీవ్‌కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణముదిరాజ్, నాగేష్‌గౌడ్, పుల్లయ్య, నారాయణ,రషీద్, ఎర్రశ్రీను ముదిరాజ్, తలారి నర్సింహా, శంకర్ నాయక్, రామస్వామి, పోలె రాజు, ముదిగొండ రమేష్, రాములుయాదవ్, రమేష్, శివరాజ్, శ్రీను నాయక్, భరత్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**భూత్పూర్,డిసెంబరు27,ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్(92) ఢిల్లీలోని ఏయిమ్స్ లో గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం దేశవ్యాప్తంగా పలుపార్టీల నాయకులు,ప్రజలు శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళులర్పించారు.ఈ క్రమంలో శుక్రవారం భూత్పూర్ మం డల, పట్టణ ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులు,ప్రజలు ఘననివాళులర్పించారు.భూత్పూర్ పట్టణ కేంద్రం లోని జాతీయ రహదారి కూడలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం ఉంచి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండడి నర్సింహ్మారెడ్డి, హరియా నాయక్,బోరింగ్ నర్సింహులు, లిక్కివిజయ్‌కుమార్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్,సంజీవరెడ్డి, తమన్నగౌడ్,దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి,తిరుపతిరెడ్డి,మాసగౌడ్, పవన్‌కుమార్,శివరాములు, మంగళివెంకటనారాయణ,ఆగిరిరవి,వడ్డెశ్రీనివాసులు,జహంగీర్ పాల్గొన్నారు.

**అమిస్తాపూర్‌లో:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో శుక్రవారం మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు స్వర్గీయ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులర్పించారు.మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి ప్రధానిగా మన్మోహన్‌సింగ్ సేవల్ని కొనయాడారు.ఈ సందర్భంగా కదిరే మాట్లాడుతూ నిరాడంబరతకు ప్రతిరూపంగా,ఆర్థికసంస్కరణల ప్రదాతగా డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరుగాంచారన్నారు.దేశం క్లిష్టపరిస్థితుల్లో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాలంలో ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ముందుకు నడిపారన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్,ఆగిరిరవి,పవన్,శివరాములుఇతరనాయకులు పాల్గొన్నారు.

**కృష్ణ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా, కృష్ణ మండలం కేంద్రంలో ప్రపంచ మేధావులలో ఒకరైన భారతదేశ మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి యువజన కాంగ్రెస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సరాఫ నాగరాజ్, కృష్ణ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్దరామప్ప, కాంగ్రెస్ నాయకులు బీమ్ నాయక్,తిమ్మన్న, వీరేష్ నాయక్,ఆసిఫ్,ఏకే లక్ష్మణ్, సిరాజ్ వసీం, జహంగీర్ మరియు గ్రామ ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించి, మౌనం పాటించారు.

**ఇటిక్యాల, డిసెంబరు27 ప్రభాతవార్త:** భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రవల్లి చౌరస్తాలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన దేశ ప్రధానిగా పనిచేసిన పది సంవత్సరాల పాటు ఆర్థిక సంస్కరణలు ఆయన నేతృత్వంలో దేశం ముందుకు పోవడం జరిగిందని నేడు కూడా దేశ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతురాజు సోమనాద్రి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రుక్మానందరెడ్డి, పెద్ద లక్ష్మన్న, బజారి వెంకటన్న, వెంకటేష్, ఉమాపతి నాయుడు, సీతారాముడు, అల్లా బకాష్, ఆదాము, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజ్ కుమార్, ప్రభుదాస్, లింగరాజు, బిచుపల్లి పాల్గొన్నారు.

**మక్తల్, డిసెంబరు27 ప్రభాతవార్త:** మూడు దశాబ్దాల క్రితం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న భారతదేశాన్ని ఆర్థిక శాఖ మంత్రి హోదాలో సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని గాడిన పెట్టిన ఘనత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దే అని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికిఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి,ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2004లో భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్,పట్టణ అధ్యక్షులు రవికుమార్, నాయకులు కోళ్ల వెంకటేష్, కట్ట సురేష్, కావలి తాయప్ప, వల్లంపల్లి లక్ష్మణ్, గొల్లపల్లి నారాయణ, వాకిటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తకోట డిసెంబరు27 ప్రభాతవార్త:** ప్రపంచ ఆర్థికవేత ఎకనామికల్ ప్రొఫెసర్‌గా, రాజకీయవేత్తగా, పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎంబి చర్చి క్రీడాకారులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలిపి మోనం పాటించారు. అజాతశత్రువుగా, తనదైన శైలిలో దేశానికి ఆర్థిక రూపశిల్పిగా మార్చి పేదల బలహీన వర్గాల కు ఉపాధి హామీ ద్వారా పని కల్పించి సమాచార హక్కు చట్టం ద్వారా అందరికీ సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి బాలలకు విద్యను తప్పనిసరిగా చేసి ఎన్నో ఎన్నెన్నో తన మౌన ప్రపంచంతో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపిన మహనీయులు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ఆయన సేవలను కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మాజీ ప్రధాన మంత్రి డా. మన్మోహన్ సింగ్ మరణం ధన్వాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జట్రం లక్ష్మయ్యగౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, భారతదేశ పురోగతికి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన కృషి, దేశ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. మన్మోహన్ సింగ్ మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక సుశిక్షితుడైన సైనికుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గాజుల శివకుమార్, ధన్వాడ పట్టణ అధ్యక్షులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ జట్రం లక్ష్మయ్యగౌడ్, నీరటి రామచంద్రయ్య, రాగ్యా నాయక్, జుట్ల ఆనంద్ కుమార్, కెంచె నరేందర్,రాజేష్‌గౌడ్, వెంకటపురం రాముగౌడ్, నరేందర్‌గౌడ్, నీరటి బాబు,కురువమల్లేష్, పూజారి నర్సింలు, హుశనయ్య, సంద స్పీకర్ లక్ష్మయ్య, యూసుఫ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మద్దూర్, 27 డిసెంబరు ప్రభాతవార్త:** భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించిన సందర్భంగా మద్దూరు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పాత బస్టాండ్ చౌరస్తాలో ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోస్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ ముద్ది బీమప్ప మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రజల కోసం ప్రత్యేకంగా 2005 సంవత్సరంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అలాగే సమాచార హక్కు చట్టం తీసుకువచ్చిన మహా ఆర్థికనేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివరాజు,జంగం బాబు, రహీం,సుభాష్, వీరేష్ గౌడ్, మల్లికార్జున్, చాంద్ పాషా, అశోక్ గౌడ్, గోపాల్ రెడ్డి, చంద్రప్ప, భీమప్ప పాల్గొన్నారు.

**రాజాపూర్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** భారతదేశ 14వ ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ చేసిన సేవలు చరిత్రలు నిలిచిపోతాయని 10 సంవత్సరాల పదవీకాలంలో గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి అనేక కొత్త పథకాలను అమలు చేశారని రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారంరాజాపూర్ మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలేపల్లి యాదయ్య, శ్రీను నాయక్, వనపర్తి నరహరి, గోనెల రమేష్, విక్రరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నజీర్ బేగ్, శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నారాయణపేట టౌన్, డిసెంబరు27 ప్రభాతవార్త:** దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, వారి మరణం దేశానికి తీరని లోటుని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో శుక్రవారం నారాయణపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి. సలీం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పార్టీ కార్యాలయం(సివిఆర్ భవన్)లో మరియు స్థానిక జిల్లా కేంద్రంలోని నర్సిరెడ్డి చౌరస్తాలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశానికి గుర్తింపు తీసుకువచ్చిన ప్రపంచ ఆర్థిక మేధావి మన్మోహన్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, సీనియర్ నాయకులు గందే చంద్రకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ భట్టాడ్, మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సరాఫ్ నాగరాజు,యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవీందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప, సీనియర్ నాయకులుబోయ రమేష్, యూసఫ్‌తాజ్, డా.సాయిబాబు, మారుతీ, అనుపూర్ సునీల్, ఎరుకలి వెంకటయ్య, రవికిరణ్, చిట్టెం సత్యరెడ్డి, పెరపల్ల శంకర్,వెంకటప్ప, కార్తీక్, సిద్దు, జనార్దన్, రాజేందర్ గౌడ్, సూర్యకాంత్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**దామరగిద్ద మండలంలో:** భారత దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల శుక్రవారం దామరగిద్ద మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మన్మోహన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించి పేదరికాన్ని నిర్మూలించి, క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి సేవలు అందింస్తూ ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన అపార జ్ఞాని డా.మన్మోహన్ సింగ్ అన్నారు. మన్మోహన్ సింగ్ మృతిదేశానికి తీరని లోటు అన్నారు.అయన సేవలు చిరస్మరణీయ మన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, మాజీ కో ఆప్షన్ ఖాజామియా, మాజీసర్పంచ్ శరణ్‌నాయక్, మాజీ ఎంపిటిసి అశోక్, కన్కిరెడ్డి,బర్ల ఆనంద్ తమ్మలి రఘు, కే. వెంకట్రాంరెడ్డి, దామరగిద్ద యువ నాయకుడు తమ్మలి రంజిత్ పాల్గొన్నారు.

**మహ్మదాబాద్ డిసెంబరు 27 ప్రభాతవార్త :** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం భారత దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని చిత్ర పటానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కేయం నారాయణ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ భారతదేశానికి ఆర్థిక వేత్తగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, దేశంలో ఎన్నో సంస్కరణలకు దిశ నిర్దేశం చేసిన వ్యక్తి అని అన్నారు. డా. మన్మోహన్ సింగ్ భారతదేశంలో ఆర్థిక శాస్త్రవేతగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన 1991లో ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యూహాన్ని మారుస్తూ దేశాన్ని గ్లోబల్ మార్కెట్లోకి చేర్చడంలో కీలక పాత్ర పోషించారన్నారు. 2004 నుంచి 2014 వరకు రెండు సార్లు భారత ప్రధానిగా సేవలు అందించడం జరిగిందన్నారు అలాగే మన్మోహన్ సింగ్ రాజకీయ ప్రస్థానం గురించి వివరిస్తూ 19912024 వరకు సుదీర్ఘకాలంరాజ్యసభ సభుడిగాబాధ్యతలు స్వీకరించారన్నారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా నాయక్, మాజీ వైస్ ఎంపీపీ రాధారెడ్డి, మాజీ ఎంపీటీసీ గూళ్ల చెన్నయ్య,బిసి సెల్ అధ్యక్షుడు ముకుందం, మాజీ కోఆప్షన్ ఈసా,మాజీ ఎంపిటిసి అక్బర్,మాజీ కోఆప్షన్ రహీం, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి ,పవన్ కుమార్, గోపాల్, సురేష్, కేశవులు పాల్గొన్నారు.











కొత్తకోటలో మౌనం పాటిస్తున్నాయి క్రీడాకారులు



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం



జిల్లాస్థాయి క్రికెట్ టీంకు ద్వితీయ బహుమతిని ప్రదానం చేస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

**ఇటిక్యాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వేముల గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో మండల పరిధిలోని షేకుపల్లి గ్రామ క్రికెట్ జట్టు ద్వితీయ బహుమతికి ఎంపిక కాగా ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు బహుమతి దాత ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రూ. 30 వేలను బహుమతి ప్రదానం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వాహకులు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. షేక్ పల్లె టీం ద్వితీయ బహుమతి గెలుపొందడం వారు క్రికెట్ టీం జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో మంద శివన్న, రాజు. అల్లా బకాష్, సుందర్, రాజశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన న్యాయవాదులు



**గద్వాల, డిసెంబరు 27,ప్రభాతవార్త:** రిలే నిరసన దీక్షలో ఉన్న గద్వాల న్యాయవాదుల సంఘం శుక్రవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గాని కలసి జిల్లా కోర్టు నిర్మాణానికి పిజెపి కాలనీలో స్థలం కేటాయించేబడేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. పార్లమెంటు సభ్యురాలు డికె అరుణ నివాసంలో శుక్రవారం కేంద్ర మంత్రినికలిసిన న్యాయ వాదుల బృందం ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా సంఘము అధ్యక్షులు ఆర్ రఘురాం రెడ్డి జిల్లాకోర్టుకు స్థల కేటాయింపులోజరుగుతున్న పరిణామాలను మంత్రి ముందు ఉంచారు.ప్రజలు విస్తృతప్రయోజనాన్ని దృష్టిలోఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఉండేలా చూడాలని సీనియర్ న్యాయవాదులు సుధాకర్, ఖాజా మోహినుద్దీన్ కోరారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు సిపిఐఎంఎల్ ఏఐపీకేఎంఎస్ నాయకుల మద్దతు



**నారాయణపేట టౌన్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్క్ వద్ద చేపట్టిన సమ్మెకు శుక్రవారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ, ఏఐపీకే ఎం ఎస్ నాయకులు మద్దతును తెలియజేసి ప్రశాంత్,చెంచే నారాయణ, అరుణోదయ రాములు మాట్లాడుతూ కేజీబీవీ యుఆర్ఎస్ సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వెట్టి చాకిరిని వ్యతిరేకించాలని ఉపాధ్యాయ న్యాయమైన పోరాటాన్ని సమర్థిద్దామని దరిద్రరేఖకు దిగువన ఉన్న విద్య పరంగావెనుకబడిన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 2004లో దేశవ్యాప్తంగా 4982 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను ఏర్పాటు చేసింది అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేయాలని 61 సంవత్సరాలు మిగిలిన ఉద్యోగులకు 20లక్షల డిపార్ట్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10లక్షలు ఆరోగ్యబీమా సౌకర్యం ఐదు లక్షలు కల్పించాలన్నారు. అందరి ఉద్యోగుల మాదిరిగా హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

## పాత నేరస్తులపై నిఘా ఉంచాలి

**మక్తల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మక్తల్ సర్కిల్ పరిధిలో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘాఉంచి, కొత్తగా నేరాలు జరగకుండా అరికట్టాలని నారాయణపేట డిఎస్పి ఎన్. లింగయ్య అన్నారు. శుక్రవారం మక్తల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. రోజు వారీగా వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది సాంకేతికత ఆధారంగా నేరాలను అదుపులోకితీసుకురావచ్చని అన్నారు. కార్యక్రమంలో సీఐ జి. చంద్రశేఖర్, ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి, ఆచారి, సిబ్బంది రామ్‌లాల్, మనోహర్, చంద్రశేఖర్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీలు ప్రారంభం

**మహబూబ్‌నగర్,డిసెంబరు 27 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీలు మహబూబ్‌నగర్ డిఎస్ఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి.తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల రెండు నిమిషాలు సంతాపం ప్రకటించారు. కబడ్డీ,నెట్ బాల్ క్రీడలలో రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీలు మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నారు. కబడ్డీ పోటీలు ఎటువంటి ఆర్భాటం లేకుండా సాధారణంగా ప్రారంభించారు.ఈ పోటీలలో జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**వెల్దండ, డిసెంబరు27 ప్రభాతవార్త:** వెల్దండమండల కేంద్రానికి చెందిన పుట్ట రామస్వామి, చెదురుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్‌పార్టీ నాయకులు అంజయ్య మాతృమూర్తి లక్ష్మమ్మలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శుక్రవారం మృతుల కుటుంబాలను పరామర్శించి మృతదేహాలకుపూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబసభ్యులతో మాట్లాడి మనోధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలోమాజీ ఎంపీపీపుట్టరాంరెడ్డి, నిరంజన్, వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, జంగిలియాదగిరి, కొండల్‌యాదవ్, తిరుపతయ్య, చంద్రయ్య, నాగయ్య ఉన్నారు.

## అణగారిన వర్గాల స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే


పూలె విగ్రహావిష్కరణ కమిటీని ఎన్నుకున్న దృశ్యం

**బిజినేపల్లి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి ఎంతో గొప్పదని, ఆ మహనీయుడు అందించిన స్ఫూర్తితోనే బల హీన వర్గాల వారు రాజకీయ, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో ముందుకు వెళ్తున్నారనీ మహాత్మాజ్యోతి రావు ఫూలేఅని జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కమిటీ గౌరవ సలహాదారులు అంతటి రాజేందర్‌గౌడ్, దాసర్ల వెంకటస్వామి అన్నారు. సల్కార్ పేట్ గ్రామంలో శుక్రవారం పూలే విగ్రహా విష్కరణ కమిటీని ఎన్నుకున్నారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ అన్ని రకాలుగా అణచివేతకు గురైన బడుగు,బలహీన వర్గాలకు అండగ నిలిచిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆటవిక రాజ్యం ఏలుతున్న రోజుల్లో జ్యోతిరావు పూలే సమాజసేవ నా ధ్యేయం, సమసమాజ స్థాపనతన ఆశయమని ప్రకటించి జ్యోతిరావుపూలే ఆయనసతీమణి సావిత్రీబాయిపూలేబడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సొంతంగా పాఠశాలలను నిర్వహించి, ఉచితంగా విద్యను అందించారని తెలిపారు. అంటరానితనం, అస్పృశ్యత రూపుమాపడం కోసంధైర్యంగా ఆనాడే ముందుండి సంఘదురాచారాలను ఎదుర్కొ న్నారని, అటు వంటి మహనీయుల అడుగు జాడల్లో నడిచి పేదల అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మండలంలో ఇప్పటివరకు పది గ్రామాల్లో కమిటీలు పూర్తి కావడం జరిగిందన్నారు.త్వరలో పూలే విగ్రహావిష్కరణలో వేలాదిగా జన సమీకరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో సత్యశిలాసాగర్, రఘుబాబు, భగవంతుగౌడ్, వంగ రామన్‌గౌడ్, చెన్నయ్య పాల్గొన్నారు.

## మినిమం టైం స్కేల్ న్యాయమైన డిమాండ్

**మహబూబ్‌నగర్ , డిసెంబరు 27 ప్రభాతవార్త:** కెజిబివి సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 18 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించే భాధ్యత ప్రభుత్వానిదేనని కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ విధానం శ్రమదోపిడి విధానమని ఏమాత్రం జీవితానికి సరిపోని జీతాలతో వెట్టి చేస్తున్న సమగ్ర శిక్ష, కేజిబివి ఉద్యోగుల మినిమం టైంస్కేల్ ఇవ్వాలనేది న్యాయమైన డిమాండ్ అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రవికుమార్, ఎన్.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ధర్నా చౌక్ లో సమ్మె చేస్తున్న కేజీబీవి సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా శిబిరానికి జిల్లా కమిటి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళులర్పిస్తూ వివిధ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మద్దతుగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.రవికుమార్,ఎన్.వెంకటేష్ లతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. నర్సింలు,జిల్లా కార్యదర్శులు హేమంత్ కుమార్, సుదర్శన్,ఖాదరయ్య,జయంతి,జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ కె.శివరాజ్, దేవరకద్ర, కోయిలకొండ, నవాబ్‌పేట, మిడ్జిల్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, రాములు,అయూబ్,వెంకటయ్య, రమేష్ వివిధ మండలాలనాయకులు బాలచంద్రుడు, ఈశ్వరయ్య,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ మంద జగన్నాథంను పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** హైదారబాదులోని నిమ్స్ ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథంను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంగా ఉండాలని, భగవంతుడి దయతో త్వరగా కోరుకోవాలని కోరారు.

## క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచాలి


జిల్లా జట్టు క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

**కల్వకుర్తి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన సీఎం కప్ కబడ్డీ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మెహన్‌లాల్‌లు జిల్లా కబడ్డీ జట్టుతో మాట్లాడి క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడల్లో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాసులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బూత్ కమిటీ నియామకం


నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** వెల్దండ మండలం బైరాపూర్ 138వ బూత్ కమిటీని బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వై.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశమై నూతన బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా కట్ల వెంకటయ్యయాదవ్‌ను ఎన్నుకొని కమిటీ నియామక పత్రం అందించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కట్ల వెంకటయ్యను శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చెన్నోజు, మల్లికార్జున చారి, కోడుపూరి శ్రీశైలం, ప్రజాపతి, గొల్సం మల్లేష్‌యాదవ్, కొర్ర సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని టోకెన్‌సమ్మె నిర్వహించడం జరిగింది. సమ్మెలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రంలో శుక్రవారం గ్రామ పంచాయతీ వర్కర్ల ఆధ్వర్యంలో అంబ భవాని ఆలయం నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్యగౌడ్ మద్దతును తెలియజేసి ఆయన మాట్లాడుతూగ్రామపంచాయతీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత గ్రామపంచాయతీ వర్కర్లకుఇచ్చి వారికి న్యాయం చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాపంతా మాసులైన నాయకులు నరసింహ రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి జోషి తాయప్ప గ్రామ పంచాయతీ వర్కర్లు చంద్రప్ప వెంకటప్ప శివానంద్ ఎల్లప్ప బాలప్ప పాల్గొన్నారు.




## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలి : ఎస్సై రేవతి


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**నారాయణపేటటౌన్, డిసెంబరు27 ప్రభాతవార్త:** వాహన దారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై రేవతి అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నారాయణపేట పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మహిళా ఎస్సై రేవతి, ఏఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని లేని యెడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.వాహనాలు నడిపే ప్రతి ఒక్కరుహెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు.వాహనాలునడిపే సమయంలో వాహనానికి సంబంధించిన ఆర్ సి డ్రైవింగ్, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.వాహనాలకు నెంబర్ ప్లేటు తప్పనిసరిగా వేయించు కోవాలని, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని లేని యెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.త్రిబుల్ రైడింగ్ వాహనాలునడుపరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మైనర్లు వాహనాలు నడుపు రాదని సూచించారు.ఆటోలలో పరిమితికి మించి ప్రజలను విద్యార్థులను ఎక్కించుకోరాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఆంజనేయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీమాత పల్లకిసేవ

### - అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్నిఅత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మద్య ఈసేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామృతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి,ప్రసాదవితరణతదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘంఅధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్‌అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతోపాటుస్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

◆ సిపిఎం నాయకులు ◆ సిపిఎం పార్టీ రిలే నిరాహార దీక్ష


దీక్షలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

**చిన్నంబావి, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గూడెం గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇవ్వాలని, భూమిలేని నీరుపేదలకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శుక్రవారం గ్రామంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శివెంకటేష్ ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగించారు. వారు మాట్లాడుతూ కూలి కుటుంబాలకు రూ. 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ రిలేనిరాహార దీక్షలకు ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ మేకల ఆంజనేయులు ప్రారంభించి ప్రసంగించడం జరిగింది. ఈ దీక్ష కార్యక్రమంలో ఎం. వెంకటేష్, గ్రామ శాఖ కార్యదర్శి వెంకటయ్య,రంగన్న, జయమ్మ, మద్దమ్మ, చిట్టమ్మ, శాంత, ఆశమ్మ, సువర్ణ, లక్ష్మీ దేవమ్మ, బుద్దమ్మ, మంజుల, పెంటయ్య,పోశన్న, కుక్కన్న,గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ



**భూత్పూర్,డిసెంబరు 27,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుర్వ శివమల్లయ్య మాతృ మూర్తి ఇటీవల మరణించగా,అందుబాటులో లేని మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం మృతురాలి ఇంటికి వెళ్లి మృతురాలి కుమారుడు కుర్వ శివమల్లయ్య వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.మృతికి కారణాలను వారి కుటుంబ సభ్యుల్ని మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అడిగి తెల్సుకున్నారు.మాజీ ఎమ్మెల్యే ఆల వెంట మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు మొల్గర నర్సింహులుగౌడ్ ఇతర నాయకులు ఉన్నారు.

## దేశం గొప్ప ఆర్థిక వేత్తను కోల్పోయింది

◆బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు బొల్లి కురుమయ్య

**కొల్లాపూర్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** భరత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని బహుజన సమాజ్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గఅసెంబ్లీ అధ్యక్షులు బొల్లి కురుమయ్య సంతాపం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ 1991 సం.లో దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నపుడు ఆర్థిక మంత్రిగా గట్టెకించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ పేదల కోసం 100 రోజుల పని రూపాకల్పన చేసి ఉపాధి హామీ పని కొనసాగుతుందంటే ఆయన ముందు చూపు ఆలోచన అని అన్నారు. పలు నూతన చట్టాలను రూపొందించాలని.సమాచారహక్కుచట్టం, గృహ హింస చట్టం, విద్యాహక్కు చట్టం, భద్రత చట్టం, నేడు ప్రతి ఒక్క వ్యక్తి గుర్తింపు ఆధారంగా ఆధార్ కార్డుల రూపకల్పన ఇలా ఎన్నో చట్టాలను తీసుకువచ్చిదేశాన్నిముందరికి తీసుకెళ్లే విధానాలను ప్రవేశపెట్టాడని కొనియాడారు. మన్మోహన్ సింగ్ 2006 సం.లో బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యవార్ కాన్షిరాంచనిపోయినప్పుడు ప్రధాని హోదాలోమన్మోహన్‌సింగ్ మాట్లాడుతూభారత రాజకీయాలను దళితులవైపు తిప్పిన గొప్పనాయకుడు కాన్షిరాం అని అన్నారు. పార్టీలకతీతంగాగౌరవం ఇచ్చేవ్యక్తి మన్మోహన్ సింగ్ అన్నారు.

## బాధితులకు మేఘన్న అభయ హస్తం


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు డిసెంబరు27 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో చెల్లిమిళ్ల కిష్టారెడ్డిపేట ఆరో వార్డుకు చెందిన బొల్లె ద్దుల ఎల్లయ్య మృతి చెందడం జరిగింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్‌గౌడ్ ద్వారా ఎమ్మెల్యే మేఘరెడ్డి ఆదేశాల మేరకు మేఘన్న భరోసాఅభయ హస్తం కింద 5000/- రూపాయలుమృతుని కుటుంబ సభ్యులకుఅందజేశారు .కార్యక్రమంలో మాజీసింగిల్‌విండోడైరెక్టర్ రాములు,సలీమ్, దేవన్నగౌడ్,తిరుపతయ్యనాయుడుకార్యకర్తలుగ్రామప్రజలు పాల్గొనరు.

## ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షులు ఉల్లంగోండ్ల రాజు ఎన్నిక


నూతన అధ్యక్షులుగా నియమాక పత్రాన్ని అందుకుంటున్న ఉల్లంగోండ్ల రాజు

**లింగాల, డిసెంబరు25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఉల్లంగోడ్ల రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండి నర్సింహులును నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కండెల ఆంజనేయులు తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని రాష్ట్ర కార్యాలయంలో నూతన అధ్యక్షులుగా నియమాక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యవస్థాపకఅధ్యక్షులు కండెల ఆంజనేయులు మాట్లాడుతూ ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ అనేది జాతి సంక్షేమం కోసంపనిచేస్తున్న ప్రతిష్టాత్మకంగా సంస్థ అని,విద్య, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి వంటి రంగాలలో ఎరుకల సమాజానికి సేవలు అందించాలని ఆయన కోరారు. సంఘం బలోపేతానికి భవిష్యత్తులో ఎరుకల సంస్కృతిని ప్రోత్సహించడం కోసం ముందుకెళ్లాలని ఆయన అన్నారు.

## పాత నేరస్తులపై నిఘా ఉంచాలి


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

**మక్తల్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** మక్తల్ సర్కిల్ పరిధిలో పాత నేరస్తులపై ప్రత్యేకనిఘా ఉంచి, కొత్తగా నేరాలు జరగకుండా అరికట్టాలని నారాయణపేట డిఎస్పి ఎన్. లింగయ్య అన్నారు. శుక్రవారం మక్తల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.రోజు వారీగా వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది సాంకేతికత ఆధారంగా నేరాలను అదుపులోకి తీసుకురావచ్చునిఅన్నారు. కార్యక్రమంలో సీఐ జి. చంద్రశేఖర్, ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి,ఆచారి, సిబ్బంది రామ్‌లాల్,మనోహర్, చంద్రశేఖర్,భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుకను సీజ్ చేసిన ఎస్ఐ

**కృష్ణ, డిసెంబరు27 ప్రభాతవార్త:** కృష్ణ మండలం, గుడబల్లూరు నుండి అక్రమంగా టైరోడ్ వైపు తరలిస్తున్న ఇసుక టిప్పర్ (కెఎ33బి5799) ను ముందుగానే పసిగట్టి, కృష్ణ మండల పోలీసులు అడ్డుకున్నారు.ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన డ్రైవరు భీమన్న తండ్రి హనుమంతు (28) చిత్తాపూర్ గ్రామం గుల్బర్గా వ్యక్తి, టిప్పర్ ఓనర్ ఆనంద్ చౌహాన్‌పై కేసు నమోదు చేసినట్లు కృష్ణమండల ఎస్సై నవీన్ తెలిపారు.

## లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

■ బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ

**నారాయణపేట టౌన్,డిసెంబరు27 ప్రభాతవార్త:** లేబర్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు, కార్మికులకు అనేక ప్రయోజనాలు అందిస్తున్నదని ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పా ప్రతి కూలి, కార్మికుడు ఈ పథకానికి అర్హులేనని అన్నారు. తెల్లకార్డు ఉన్న ప్రతి వ్యక్తి దరఖాస్తు చేసుకోవచ్చని 5 ఏళ్లకు ఒకసారి రూ. 110 చెల్లించి చేరవచ్చని తెలిపారు. 18 నుంచి 55 సంవత్సరాల స్త్రీ,పురుషులు తెల్ల రేషన్ కార్డు,ఆధార్ కార్డు జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పాలసీ దారులు మరణిస్తే లక్షా 30 వేల ఆర్థిక సహాయం అందుతుందని, ప్రమాద వశాత్తూ మరణిస్తే 6లక్షలు, ఒక ఆడపిల్లకు వివాహ కానుకగా 30వేలు, పాలసీ పొందిన ఏడాది గడిచిన తరువాత ప్రమాదం జరిగితే 2లక్షల 50వేల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇంకా అనేక ప్రయోజనాలు ఉన్నాయనీ వెంటనే దరఖాస్తు చేసుకోవాలనీ సూచించారు.

## నేడు పట్టణంలో సీనియర్స్ ఖో ఖో మహిళల, పురుషుల జట్ల ఎంపిక

**కల్వకుర్తి, డిసెంబరు27 ప్రభాతవార్త:** మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సీనియర్స్ మహిళల, పురుషుల జట్ల ఎంపిక ఉంటుందని నిర్వాహకులు శుక్రవారం ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్,ప్రధాన కార్యదర్శి జిఏవిలియంలు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు మిగతా వివరాలకోసం జి.రాజు (99850 23847), జిపురంచంద్(9951313615),మోహన్‌లాల్ (991252 4385), ప్రసాద్(9440948072) పోన్ నెంబర్లలకు పోన్ చేసి సంప్రదించగలరని కోరారు.

## బాధితునికి ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన దశరథంఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాధితుడు దశరథంను సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు రూ.10 వేలు సమకూర్చి శుక్రవారం మాజీ సర్పంచ్ సాయికుమార్ ద్వారా ఆర్థిక సహాయాన్ని బాధితునికి అందించారు. బాధితుడికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో చల్ల మధుసూదన్‌రెడ్డి,రాములుయాదవ్, ఎండి.సిరాజ్, ప్రభాకర్, జంగిలి నిరంజన్, లింగం ముదిరాజ్, నిరంజన్, సైదులు, నాగయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన పుట్ట రామస్వామి, చెదురుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు అంజయ్య మాతృమూర్తి లక్ష్మమ్మలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శుక్రవారం మృతుల కుటుంబాలనుపరామర్శించి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలోమాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, నిరంజన్, వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, జంగిలియాదగిరి, కొండల్‌యాదవ్, తిరుపతయ్య, చంద్రయ్య, నాగయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## జమ్ములమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహుకరణ


అమ్మవారి ఆలయంలో వెండి కిరీటం అందజేస్తున్న కొంకతి రాజేష్

**గద్వాల డిసెంబరు 27 ప్రభాతవార్త:** 7హిల్స్ ప్రింటర్స్ హైదరాబాద్ అధినేత కొంకతి రాకేష్ శ్రీ జమ్ములమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహుకరించారు. శుక్రవారం గద్వాల్ పట్టణంలోని జమ్ములమ్మ అమ్మవారి మొక్కులు తీర్చుకున్న 7హిల్స్ ప్రింటర్స్ హైదరాబాద్ అధినేత కొంకతి రాకేష్ కుటుంబ సభ్యులతో కలిసి జమ్మూలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఒక కేజీ వెండి కిరీటాన్ని అందజేసి మొక్కులు తీర్చుకునగా దేవాలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ధన్వాడ ఎన్టీఆర్ కాలనీలో ఎమ్మెల్యే నిధులతో బోరు

**ధన్వాడ, డిసెంబరు 27 ప్రభాతవార్త:** ధన్వాడ మండల కేంద్రంలో కుర్వగేరి ఎన్టీఆర్ కాలని దగ్గర ఎమ్మెల్యే నిధులతో చిట్టెం మాధవరెడ్డి హామీ మేరకు బోరు వేసి మోటారు దించి ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిట్టెం మాధవరెడ్డి కాంగ్రెస్ నాయకులు, ధన్వాడ పట్టణ అధ్యక్షులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ జట్రం లక్ష్మయ్యగౌడ్, నీరటి రామచంద్రయ్య, జుట్ల ఆనంద్ కుమార్, కెంచే నరేందర్, రాజేష్ గౌడ్, వెంకటపురం రాముగౌడ్, నరేందర్ గౌడ్,నీరటిబాబు, కురువమల్లేష్, పూజారినర్సింలు, చంద బాలరాజు హుశనయ్య, సంద స్పీకర్ లక్ష్మయ్య, యూసుఫ్ ఖాన్, రెహ్మాన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

